ప్రజాశక్తి
శుక్రవారం 19 జనవరి 2024

భళా ఆద్యలక్ష్మి

నృత్య పోటీల్లో చిన్న వయస్సులోనే రికార్డు

చిన్నారిని అభినందిస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌ఫర్సన్ గిరిజమ్మ

అనంతపురం : రవీంద్ర భారతిలో శ్రీ ఆర్ట్ నిర్వహించిన నృత్య పోటీల్లో అతి చిన్న వయస్సులో చిన్నారి ఆద్యలక్ష్మి విశేష ప్రతిభ కనబరిచింది. నగరంలోని హౌసింగ్ బోర్డు, ఓల్డ్ ఎస్‌బిఐ కాలనీలో ఉన్న ఆర్యన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జూనియర్ కేజీ చదువుతున్న ఆద్యలక్ష్మి ఈనెల 15న రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య పోటీల్లో ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు, నాట్య మయూరి అవార్డు సాధించింది. దీంతో విషయం తెలుసుకున్న కలెక్టర్ గౌతమి, డిఇఒ నాగరాజు చిన్నారితోపాటు పాఠశాల ప్రిన్సిపల్, సైకాలజిస్ట్ లహరి, డైరెక్టర్లు రాజు, సందీప్, తల్లిదండ్రులను అభినందించారు.

విషాదం

విద్యుదాఘాతంతో తండ్రీకుమారుడు మృతి

మృతి చెందిన భయపరెడ్డి... రాజారెడ్డి (ఫైల్ ఫొటో)

అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని జగంరెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఉదయం తీవ్ర విషాదఘటన చోటు చేసుకుంది. పొలంలో మోటారు మరమ్మతు నిమిత్తం వెళ్లిన తండ్రీకుమారుడు ఇద్దరూ విద్యుత్ షాక్‌తో మరణించారు. సంక్రాంతి పండుగ ముగిసిన మరునాడే ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఆ కుటుంబం, గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ పెద్ద, చేతికందిన కుమారుడు ఒకే సారి మరణించడంతో ఆ ఇల్లు కన్నీటి సంద్రం అయ్యింది. ఉదయం ఇంటి నుంచి పొలంకు వెళ్లిన తండ్రీకుమారులు ఇద్దరూ విఘత జీవులుగా పొలంలో పడి ఉండడాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు గుండలవసేలా రోధించారు. నార్పల మండలం జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భయపరెడ్డి(43), ఆయన కుమారుడు రాజారెడ్డి(17) ఇద్దరూ పొలంలో విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. వేరుశనగ పంటకు నీటి తడిని అందచే క్రమంలో భాగంగా మోటార్‌ను పట్టుకోవడంతో షాక్ గురై వీరు మృతి చెందారు. పండుగ పూట చోటు చేసుకున్న ఈ విషాధ ఘటనతో జంగంరెడ్డి పల్లి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

వార్త మెయిన్‌లో

కలకలం

పుట్టపర్తిలో ఎడిపై హత్యాయత్నం

తీవ్రంగా గాయపడిన ఎడి రాజశేఖర్‌రెడ్డి

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో బుధవారం రాత్రి తీవ్ర కలకలం రేగింది. జిల్లా స్థాయి ప్రభుత్వ ఉద్యోగిపై ఆయన ఇంటి వద్దనే హత్యాయత్నం జరిగింది. కళ్లలో కారం చల్లి ఇనుపరాడ్డుతో గుండెల్లో పొడిచారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో జనం ఉలిక్కి పడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా భూగర్భ జలవనరుల శాఖలో ఎడీగా రాజశేఖర్‌రెడ్డి పని చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల వికలాంగుల సంఘం నాయకునిగానూ పని చేస్తున్నారు. ఈయనపై హత్యాయత్నం జరగడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కుటుంబ కలహాలా.. లేక కార్యాలయంలో విభేదాలా మరో ఏమైనా కారణాలు ఉన్నాయన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితుడు హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రాజశేఖర్ రెడ్డిపై హత్యాయత్నంను జిల్లా వికలాంగుల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు.

వార్త మెయిన్‌లో

స్వాధీనం

రూ.1.75 కోట్లు పట్టివేత

స్వాధీనం చేసుకున్న డబ్బు వివరాలను వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

ఉరవకొండ : ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని విడపనకల్లు మండల శివారులో 42వ జాతీయ రహదారిలో పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులో ఉన్న సెబ్ చెక్‌పోస్ట్ వద్ద అనంతపురం సెబ్ జిల్లా అడిషనల్ ఎస్పీ జి.రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, ఎస్ఐ ఖాజాహుస్సేన్, సెబ్ ఎస్ఐ రమణారెడ్డి, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా బళ్లారి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ కారులో రూ.1.75 కోట్లను పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించి కారు డ్రైవర్ సీటులో కూర్చొన్న వ్యక్తిని ఆరాతీయగా తాను కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిరిగుప్ప తాలూకాకు చెందిన కృష్ణారెడ్డిగా చెప్పినట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరులో స్థలం కొనుగోలు నిమిత్తం సిరిగుప్ప నుంచి బెంగళూరుకు వెళ్తున్నట్లు చెప్పారన్నారు. డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలూ చూపకపోవడంతో డబ్బుతో పాటు కారును సీజ్ చేసి ఐటి విభాగం అధికారులకు స్వాధీనం చేశారు.

23న ఉరవకొండలో ముఖ్యమంత్రి పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ గౌతమి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈనెల 23వ తేదీన ఉరవకొండ పట్టణంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం జమ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి ఉరవకొండలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం ఉరవకొండ పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కళాశాల గ్రౌండ్‌లు, అనంతపురం రోడ్ లోని భారత్ పెట్రోలియం వద్ద, విడపనకల్ రోడ్ లో ఉన్న స్థలాలను కలెక్టర్ ఎం.గౌతమి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం జమ చేసే కార్యక్రమం ఉరవకొండలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రాథమికంగా సభాస్థలి, హెలిప్యాడ్, పార్కింగ్‌ల కోసం పలు చోట్ల స్థల పరిశీలన చేశామన్నారు. కూడేరు, గుంతకల్లు, నియోజకవర్గం సంబంధించి అన్ని మండలాల నుంచి వచ్చే వారికి పార్కింగ్ ఏర్పాట్ల కోసం అవసరమైన స్థలాలను పరిశీలించామన్నారు. రెండు రోజుల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించి ఏర్పాట్లు, తదితర అంశాలపై ఆదేశాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఎస్పీ నరసింగప్ప, వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఆర్అండ్‌బి డిఈ కాటమయ్య, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరవకొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, విశేశ్వరరెడ్డి తదితరులు

జీతాలు అడిగితే అక్రమ కేసులు పెడతారా.?

◆కార్మికులపై కేసులు ఉపసంహరించుకోవాలి ◆సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-ఉరవకొండ

తమకు రావాల్సిన వేతనాలు ఇవ్వమని కోరినందుకు శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులపై అక్రమ కేసులు పెడతారా అంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రశ్నించారు. ఉరవకొండ పోలీస్ స్టేషన్లో కార్మికులపై నమోదు చేసిన కేసులు ఉపసంహరించుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. గురువారం నాడు ఉరవకొండ సిపిఎం కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు గత ఐదు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతనాలు ఇవ్వకుండా వారితో వెట్టి చాకిరీ చేయించుకోవడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వంతోపాటు కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకూ కుటుంబాలు ఉంటాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న వారిపై అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి పోలీసులు అక్రమ కేసులు బనయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తాగునీటి పైప్లైన్ పగిలిపోవడానికి కారకులు ఎవరో తెలుసుకోవాలన్నారు. పైప్లైన్ పగిలిపోవడానికి కారకులైన ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ హుస్సేన్‌బాషా, డిఈ శ్రీనివాసులు, కనేకల్ మండలం సొల్లాపురం సర్పంచి భాస్కర్ రెడ్డిపై కేసులు నమోదు చేయకుండా సమ్మెలో ఉన్న కార్మికులపై కేసులు ఎలా పెడతారన్నారు. కార్మికులపై పెట్టిన కేసులు ఉపసంహరించు కోకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, నాయకులు ఇంద్రావతి శీనప్ప, వెంకటేశులు, వినోద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు నగర కార్యదర్శి వెంకట్ నారాయణ, జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో కమిషనర్ మేఘ స్వరూప్‌నకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు సాంకేతిక విద్య ఆధారంగా స్కిల్డ్ వేతనాలు అమలు చేస్తామని గతంలో జీవో జారీ చేసిందన్నారు. అయితే ఈ జీవో ఇంతవరకూ అమలుకు నోచుకోలేదన్నారు. ఇటీవల మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సంయుక్తంగా 16 రోజులపాటు నిరవధిక సమ్మె చేస్తే వేతనాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం ముద్ర వేసిందన్నారు. అయితే వేతనాల పెంపుపై ఐఎఎస్ అధికారుల కమిటీ వేసి చేతులు దులుపుకుందన్నారు. దీంతో కార్మికులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనయ్యారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్ వేతనాలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మల్లికార్జున, వివిఎస్.రాయుడు, నగర అధ్యక్షులు ఓబులపతి, ట్రెజరర్ పోతలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ మేఘ స్వరూప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఇంజినీర్లతో తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్త సేకరణ, తరలింపునకు తీసుకోవాల్సిన చర్యలపై వివరింఆచరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వతేదీ నుంచి ఆరు సర్కిళ్లలో చెత్త నిర్వహణను సంబంధిత సిబ్బంది విధిగా పర్యవేక్షించాలన్నారు. కార్మికులపై వదిలేసి ప్రేక్షక పాత్ర పోషిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి డివిజన్ నుంచి ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు చెత్త తరలించాలన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఇఇ సూర్యనారాయణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతి ఔన్నత్యాన్ని దశదిశలా చాటిన ఎన్టీఆర్

ప్రజాశక్తి-అనంతపురంకలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్‌కు నివాళి

అనంతపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

తెలుగువారి ఆరాధ్యనటుడిగా, దైవంగా తెలుగు జాతి ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలల చాటిన చిరస్మరణీయుడు నందమూరి తారక రామారావు అని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నగరంలోని పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత శిల్పారామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం లలిత కళా పరిషత్‌లో రక్తదాన శిబిరాన్ని శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్, వర్ధంతి కార్యక్రమాలను ప్రతి ఏటా జిల్లాకేంద్రంలో పెద్దఎత్తున చేపడుతున్నామన్నారు. ఎన్టీఆర్ విప్లవాత్మక భావాలతో ప్రజల్లో పాలకుడు ఏ విధంగా ఉండాలి, నిజాయితీగా ఎలా వ్యవహరించాలో చూపించారన్నారన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా కాకమునుపు అవినీతి అక్రమాలతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అతలాకుతలమై అసంతృప్తి జ్వాలలు ఎగిసి పడే సమయంలో తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసి రాష్ట్రంలో విప్లవం తీసుకొచ్చారని గుర్తు చేశారు. అనంతరం లలిత కళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో దాదాపు 100 మంది రక్తదానం చేశారు. తర్వాత ప్రభుత్వాసుపత్రిలో 1000 మంది రోగులకు పండ్లు, బెడ్లు, పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. టిడిపి నాయకులు సరిపుటి రమణ ఆధ్వర్యంలో సాయినగర్‌లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లలిత కళాపరిషత్ లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎన్టీఆర్ పాటలతో, డ్యాన్సులతో ప్రాంగణం హోరెత్తింది. ఆయా కార్యక్రమాల్లో సినీనటులు శివాజీ, నాగినీడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్‌రెడ్డి, సాలార్ బాషా, నటేష్ చౌదరి, డిష్ నాగరాజు, నారాయణస్వామి యాదవ్, సుధాకర్‌యాదవ్, ముక్తియార్, జెఎం.బాషా, సురేంద్ర, గోపాల్‌గౌడ్, మార్కెట్ మహేష్, వన్నూర్, బంగి నాగ, తెలుగు మహిళలు స్వప్న, విజయశ్రీ రెడ్డి, సంఘ తేజస్విని, సరళ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

పౌరసరఫరాల శాఖ డిఎం రవీంద్ర

ప్రజాశక్తి-ఉరవకొండ



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ డిఎం రవీంద్ర

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ డిఎం రవీంద్ర కోరారు. గురువారం ఉరవకొండలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎడిఎ పద్మజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కందుల కొనుగోలు చేస్తోందన్నారు. ప్రస్తుతం క్వింటా రూ.9,314గా ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్నిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా దూరాన్ని బట్టి లగేజ్ ఛార్జీలను కూడా చెల్లిస్తామన్నారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ కేవలం తూకాల్లో 50 కిలోలకు 600 గ్రాములు మాత్రమే తీసుకుంటామని, ఎలాంటి రిబేటు తీసుకోమన్నారు. కాకపోతే తేమశాతం 12శాతం ఉంటూ ఎలాంటి పుల్లలు, తరుగులు ఉండరాదన్నారు. అలాంటి వాటిని జల్లెడ వేసి తీసుకుంటామని వివరించారు. తీసుకున్న సరుకును బట్టి కేవలం ఆరు రోజుల్లోపు రైతులకు నగదును ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, వజ్రకరూరు ఏవోలు శుభకర్, మధుకర్, ఉరవకొండ పిఎసిఎస్ సిఇఒ గౌస్, జూనియర్ అసిస్టెంట్ దినేష్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం క్యాలెండర్ ఆవిష్కరణ

గుంతకల్లు : పట్టణంలోని కామ్రేడ్ హంపిరెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ప్రజలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజా, రైతు, కార్మిక సమస్యలపై సిపిఎం పార్టీ చేసిన పోరాటాలు, సమాజానికి, ఉపయోగపడే అనేకమైన అంశాల చిత్రాలను క్యాలెండర్‌లో ముద్రించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు ఓబులేసు, షబ్బీర్, సూరి, రామునాయక్, మల్లికార్జున, కెవిపిఎస్ సూరి, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు శకటం సిద్ధం చేయండి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 26న జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో ప్రదర్శించేందుకు వ్యవసాయ శాఖకు సంబంధించిన శకటాన్ని సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో డిఎఒ అధ్యక్షతన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై రైతు శిక్షణా కేంద్రం డిడిఎ సి.మద్దిలేటి, ఎడిఎ శైలకుమారి, భూసార పరీక్ష కేంద్రం ఎడిఎ రోజా పుష్పలత, బిసి ల్యాబ్ ఎడిఎ పద్మలత, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలు, సేవలు ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా శకటం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్‌నాయక్, శంకర్‌లాల్ నాయక్, అర్చన, శ్రీనాథ్‌రెడ్డి, నాగేంద్ర, ఉమామహేశ్వరి, శ్రీనివాసులు, వ్యవసాయ విస్తరణ అధికారిణి శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్

ప్రజాశక్తి-ఉరవకొండ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

రాష్ట్రంలోని గిరి జనులను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి గిరిజన, బంజారా ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పట్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గిరిజనులకు సాగు హక్కు పత్రాలు మంజూరు చేసి అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే ఉరవకొండ నియోజకవర్గంతోపాటు జిల్లాలోని గిరిజన రైతులకు సాగు హక్కు పత్రాలు మంజూరు చేశామని తెలిపారు. ఆయన తనయుడు, సిఎం జగన్ తండ్రి బాటలో ముందుకు నడుస్తూ గిరిజనులకు అండగా నిలిచారన్నారు. జగన్ పాలనలో కూడా అర్హత కలిగిన ప్రతి గిరిజన రైతుకూ సాగు హక్కు పత్రాలు మంజూరు చేశారన్నారు. ఇంకా అర్హత ఉండి సాగు హక్కు పత్రాలు మంజూరు కానీ గిరిజన రైతులకు త్వరలోనే సాగు హక్కు పత్రాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి, రాయదుర్గం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భోజరాజునాయక్, జివిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్, సీనియర్ నాయకులు గోవిందునాయక్, వజ్రకరూరు ఎంపిపి దేవీబాయి, సర్పంచి శివాజీ, నాయకులు సుంకేనాయక్, చంద్రమౌళినాయక్, ప్రసాద్‌నాయక్, నాగరాజునాయక్, సీనానాయక్, వెంకటేష్‌నాయక్, చంద్రానాయక్, తిప్పేస్వామినాయక్, బాబునాయక్, చత్రేనాయక్, హనుమంతునాయక్, సుంకేనాయక్, తిరుమలనాయక్, భీమానాయక్, నారాయణనాయక్, వెంకటనాయక్, రమేష్‌నాయక్, తులసినాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేతులు పైకి ఎత్తి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఉరవకొండ అంగన్వాడీల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

'ఓట్ల కోసం మా నెత్తిపై చేతులు పెట్టావ్'..!

కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళనలు-'అనంత'లో తలపై చేతులు పెట్టుకుని నిరసన

పట్టించుకోకుంటే పతనం తప్పదు : సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'ప్రతిపక్ష నేతగా ప్రతి మహిళ నెత్తిపై చేతుల పెట్టి ఓట్లు అడిగావు.. మహిళలు అన్నగా భావించి ఓట్లు వేసి గెలిపిస్తే ముఖ్యమంత్రి అయ్యావ్.. ఇప్పుడు మహిళల సమస్యలు పరిష్కరించమంటే చేతులు కట్టుకుని కూర్చుకున్నావ్... మీ వైఖరితో నీ చేతులు నీ నెత్తి మీద పెట్టుకుని ఓటమికి బాటలు వేసుకుంటున్నావ్..' అంటూ అంగన్‌వాడీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 28వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అనంతపురం కలెక్టరేట్ ఎదుట 24 గంటల రిలే నిరహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద రోడ్డుపై బైటాయించి కార్మికులు, సిఐటియు నాయకులు ముఖ్యమంత్రి ముఖచిత్రం ధరించి ప్రజల నెత్తిపై చేతులు పెట్టి దగా చేశాడంటూ తలపై చేతులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నగర కార్యదర్శి ముత్తుజా, మన్నిల రామాంజినేయులు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జయభారతి, జమున, నాయకులు అరుణమ్మ, రుక్మిణి, ఆరీఫా, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వ పతనం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హెచ్చరించారు. ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. ఇందులో భాగంగా ఉరవకొండలో అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు చేపట్టిన సమ్మె శిబిరం వద్దకు సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయానా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా 38 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ఏస్మా ప్రయోగించడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, నాయకులు సీనప్ప, వెంకటేశులు, వినోద్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నారాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్ళ విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, రంగమ్మ, శ్వేత, సరోజమ్మ, బ్యుల లోకమ్మ, శశికళ, శివశ్రీ, వరలక్ష్మి, రామాంజనేయ, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు



గుత్తిలో అంగన్వాడీల భిక్షాటన

అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం గుత్తిలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వీరికి కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున మద్దతు పలికారు. అనంతరం పలు ప్రాంతాల్లో ర్యాలీ చేస్తూ భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు కళ్యాణి, పార్వతి, శారద, గంగ, బావమ్మ, శోభారాణి, నాగరత్న, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 38వ రోజుకు చేరుకుంది. వీరికి సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షుడు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ భూషణ్, అంగన్వాడీ మండల అధ్యక్షురాలు జయలలిత, రమాదేవి, శశికళ, అనంతలక్ష్మి, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. వీరికి సిపిఎం అధ్యక్షుడు కుళ్లాయప్ప మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు డొక్కా శ్రీదేవి, విజయలక్ష్మి, జయలలిత, రామాంజనమ్మ, రేణుక, సుధామణి, వెంకటలక్ష్మి, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. వీరికి సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుక మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న, ప్రాజెక్ట్ లీడర్ రమణమ్మ, మండల అధ్యక్షురాలు భారతీయ ప్రమీల, అంగన్వాడీలు రత్నమ్మ, రాజేశ్వరి, రాధిక, సుగుణ, కాంతమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 38వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపట్టిన నిరవధిక సమ్మెను కొనసాగించారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

గుంతకల్లులోని మున్సిపల్ కార్యాలయ ం వద్ద గురువారం అంగన్వాడీలు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో సంతకాల సేకరణ చేపట్టారు. సమ్మెపై ప్రభుత్వం స్పందించేంత వరకూ కొనసాగిస్తామని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రేష్మ, గంగ, నాయకురాళ్లు నాగమణి, జూలీ, పార్వతి, మేరీ తెలిపారు.

గార్లదిన్నె మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 38వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు అరుణ, దేవి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరులో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం పెద్దవడుగూరులో నల్లబ్యాడ్జిలు కళ్లకు కట్టుకుని నిరసన తెలిపారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి మద్దతు తెలిపారు.

అంగన్వాడీల సమ్మె రాయదుర్గంలో 38వ రోజూ కొనసాగింది. మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గుంతకల్లులో సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

వేతనాలు అడిగితే కార్మికులపై కేసులా?

చెల్లించాకే మోటార్లు ఆన్ చేస్తాం-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కష్టపడి పని చేస్తున్న శ్రీరామిరెడ్డి కార్మికులు తమ వేతనాలను చెల్లించాలని ఆందోళన చేస్తే పోలీసులతో అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గంగా ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 18వ రోజుకు చేరుకుంది.. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెలో భాగంగా కార్మికులు పంపు మోటార్లను నిలిపివేయగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రయివేట్ కార్మికులతో పంపు మోటార్లను ఆన్ చేయడానికి యత్నించారన్నారు. దీంతో శ్రీరామిరెడ్డి కార్మికులు అడ్డుకున్నారన్నారు. అయినా అధికారులు నీటి సరఫరాకు యత్నించడంతో నీటిపైపులు పగిలిపోయాయన్నారు. ఇందుకు అధికారులు కార్మికులను బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. సమ్మెలు చేసినప్పుడు 5 నెలల వేతనాల్లో 2 నెలల వేతనాలు ఇచ్చి సమ్మె విరమింపజేయడం, తిరిగి బాకాయిలు పెట్టడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిపోయిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. 10 నెలల పిఎఫ్ సొమ్ము చెల్లించలేదన్నారు. కాంట్రాక్టర్ టెండర్‌లో పిఎఫ్ కేటాయించలేదంటూ తప్పించుకుంటున్నారని, అధికారులు మాత్రం ఇస్తామంటూ కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. కార్మికులకు మాత్రం సకాలంలో వేతనాలు రావడం లేదని, వచ్చే అరకొర సౌకర్యాలు కూడా కోత విధిస్తూ కార్మికులకు అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. ధర్నా దగ్గరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ హసన్‌బాషా సిఐటియు నాయకులు, కార్మికులతో చర్చలు జరిపారు. రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని సమ్మె విరమించాలని కోరారు. అయితే వేతనాలు చెల్లించిన తరువాతనే సమ్మె విరమిస్తామని నాయకులు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఈ శ్రీనివాసులు, సిఐటియు నాయకులు ఏజి.రాజమోహన్‌రెడ్డి, మన్నిల రామాంజినేయులు, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల యూనియన్ కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి, నాయకులు నరేష్, రామాంజినేయులు, ప్రభాకర్, అశోక్, సంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

మధ్యంతర భృతిని ప్రకటించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన ఎపిటిఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్‌లకు జూలై 2023 నుంచి అమలు చేయాల్సి ఉన్న 12వ పిఆర్‌సి ఇంకా ఆలస్యమవుతున్నందున సత్వరమే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని కోరారు. అలాగే 11వ పిఆర్‌సి బకాయిలు ఇవ్వాలన్నారు. డిఏ బకాయిలు సరెండర్ లీవ్ పిఎఫ్ లోన్లు అదేవిధంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ లోన్ లు తక్షణమే మంజూరు చేయాలన్నారు. 117 జిఓను రద్దు చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎప్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. యువచైతన్య రథ బస్సుయాత్రలో భాగంగా గురువారం మండలంలోని కొండూరు, వీరన్నపల్లి, నాగలాపురం, కొట్టాలపల్లి గ్రామాల్లో బస్సుయాత్ర సాగింది. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు, చిన్నారులు, యువతీ, యువకులు, వృద్ధులతో ప్రత్యేకంగా చర్చించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు భిన్నంగా తాము అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మిడుతూరులో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గన్నెవారిపల్లి మాజీ సర్పంచి చింబిలి వెంకటరమణ, టిడిపి నాయకులు కొండూరు కేశవరెడ్డి, ఆవులాంపల్లి కేశవరెడ్డి, బాలిరెడ్డి, గంగరాజు, దివాకర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, కొండూరు హరినాథ్‌రెడ్డి, హరికృష్ణారావు, రవిశేఖర్‌రెడ్డి, ఇటుకనాలు, రంగప్ప, ప్రసాద్‌యాదవ్, రమేష్, చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

ఎస్‌కెయు విసి హుస్సేన్‌రెడ్డికి సన్మానం

అనంతపురం కలెక్టరేట్ : శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన కె.హుసేన్‌రెడ్డిని వర్శిటీలో పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కెమిస్ట్రీ విభాగంలో అనేక ఏళ్లుగా పనిచేసి వర్శిటీ పై ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకున్ని వైస్ ఛాన్సలర్‌గా ప్రభుత్వం నియమించడం మంచి పరిణామం అని అసోసియేషన్ నాయకులు తెలిపారు. యూనివర్శిటీ అభివద్ధికి కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఉసేని, జయచంద్రారెడ్డి, వీరరాజు, శివారెడ్డి, శీనయ్య, కరుణాకర్, పరందామ, సాకే రాజు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసి హుసేన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' స్టిక్కర్ల విడుదల

రాయదుర్గం : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' స్టిక్కర్స్ విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, నాయకులు వెంకటేశులు, బిసి సెల్ తాలూకా అధ్యక్షుడు తిప్పయ్య, ఇనాయత్‌బాషా, తిప్పేస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆడవారిలోనే అధికంగా థైరాయిడ్ సమస్యలు

సవీరా ఆసుపత్రి కన్సల్టెంట్ డా॥ఎం. వైభవ్

ప్రజాశక్తి-అనంతపురం

థైరాయిడ్ సమస్యలు ఆడవారిలోనే అధికంగా వస్తామని సవీరా ఆసుపత్రి కన్సలెంట్ డాక్టర్ ఎం.వైభవ్ తెలిపారు. థైరాయిడ్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ థైరాయిడ్ ఒక దీర్ఘకాలిక సమస్య అన్నారు. దేశంలో ప్రతి పదిమందిలో ఒకరి కన్నా ఎక్కువ మంది థైరాయిడ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్య మగవారిలో కన్నా, ఆడవారిలో దాదాపు రెట్టింపు కనిపిస్తుందన్నారు. గొంతు ముందు భాగంలో ఉండే థైరాయిడ్ గ్రంథి నుంచి ఉత్పత్తి అయ్యే హార్మోన్ ప్రభావం శరీరంలోని దాదాపు ప్రతి అవయవంపై ఉంటుందన్నారు. ఈ హార్మోన్ ఉత్పత్తి తగ్గితే హైపో థైరాయిడ్ అని, అధికంగా ఉంటే హైపర్ థైరాయిడ్ అని అంటారన్నారు. గర్భిణుల్లో ఈ సమస్యను ముందుగా గుర్తించకపోతే పుట్టే పిల్లల్లో మేధాపరమైన లోపాలు ఉండవచ్చన్నారు. కావున థైరాయిడ్ సమస్యను ఆలస్యం చేయకుండా గుర్తించి సరైన చికిత్స పొందడం చాలా ముఖ్యమన్నారు.

హైపో థైరాయిడ్ లక్షణాలు : నీరసం, మలబద్ధకం, చర్మం, వెంట్రుకలు పొడిబారడం, ఎక్కువ నిద్ర, బరువు పెరగడం, నెలసరిలో రక్తస్రావం ఎక్కువగా లేక తక్కువగా అవ్వడం, గర్భస్రావం, చలిని తట్టుకోలేక పోవడం, గుండె తక్కువసార్లు కొట్టుకోవడం, జుట్టు రాలడం వంటివి.

హైపర్ థైరాయిడ్ లక్షణాలు : ఆకలి ఎక్కువ అవ్వడం, బరువు తగ్గడం, చెమటలు ఎక్కువ పట్టడం, చిరాకు, స్థిమితం లేకపోవడం, నిద్ర లేమి, నీరసం, ఎక్కువసార్లు విరేచనం అవ్వడం, నెలసరిలో రక్తస్రావం తక్కువగా అవ్వడం, వేడిని తట్టుకోలేక పోవడం, గొంతు ముందు వాపు, గుండె దడ అనిపించడం, కళ్లు పెద్దవిగా అవ్వడం, చేతులు వణకడం వంటివి కనిపిస్తుంటాయి. థైరాయిడ్ గ్రంథి వాపు వంటి లక్షణాలు కనిపిస్తే థైరాయిడ్‌గా గుర్తించాలన్నారు. వెంటనే సమస్యను సరిగ్గా గుర్తించి సరైన మందును, సరైన మోతాదులో వాడాలన్నారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి పరీక్ష చేసుకుంటూ, వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు.

పోలీసులకు ఎస్పీ అభినందన

కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ

అనంతపురం : హత్యకేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తోపాటు కానిస్టేబుళ్లను ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. శింగనమల మండలం ఉల్లికల్లు ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే... ఉల్లికల్లు ఎస్సీ కాలనీకి చెందిన పాలకుల చిన్న చౌడయ్య హత్య కేసులో నిందితులైన పాలకుల సూర్యనారాయణ, పాలకుల పెద్దన్న, పాలకుల రామాంజనేయులు, పాలకుల రామాంజినమ్మలకు జీవిత ఖైదు విధించారు. ఈ కేసులో జిల్లా ప్రధాన కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావమల్లు హరినాథ్‌రెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించి దోషులకు కఠిన కారాగార శిక్ష పడేవిధంగా కృషి చేసేందుకు, ఈయనకు సహకరించిన హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు సుంకన్న, రామమోహన్‌ను గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో అభినందించి మెమొంటో అందజేసి సన్మానించారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఉరవకొండ : జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మధు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ బంగ్లా వద్ద ఆలిండియా ఎస్సీ, ఎస్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గుడిసె దేవానంద ఆదేశాల మేరకు త్వరలో చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గురుకులాల్లో సమస్యలు పరిష్కరించడంతోపాటు తాడిపత్రి, కళ్యాణదుర్గం, ముదిగుబ్బ పాఠశాలలను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు రాము, ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షులు భీమేష్, బీఎస్‌ఎఫ్ మండలాధ్యక్షుడు సింహాద్రినాయక్, ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజనేయులు, సురేష్, చెన్నకేశవులు, విద్యార్థి సంఘం నాయకులు గురు, మురళి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బోదకాలుపై సర్వే

బుక్కరాయసముద్రం : మండలంలోని వడియంపేట గ్రామంలో గురువారం ఫైలేరియా (బోదకాలు) నైట్‌బ్లడ్ సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా సిహెచ్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆరు బృందాలుగా ఏర్పడి సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకూ రక్తపూతల సేకరణ చేపట్టారు. సుమారు 300 మంది రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నుంచి సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సబ్ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, నూర్‌బాషా, పిహెచ్‌ఎం చెన్నమ్మ, సూపర్‌వైజర్ జానీ రాజు, ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, శివానంద, నాగరాజు, ఆనంద్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ గౌతమి, శ్రీజ, మంజు, భార్గవి, జ్యోతి, యామిని, మహిళా ఆరోగ్య కార్యకర్తలు రాజేశ్వరి, అంజనమ్మ, బొజ్జమ్మ, నాగేంద్రమ్మ, లక్ష్మీదేవి, నందిని, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

గుంతకల్లు : మున్సిపల్ కౌన్సిల్ హాలులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ వి.మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించనున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : జిల్లా ప్రయివేట్ లాబ్ టెక్నీషియన్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జిల్లా వైద్యాధికారి ఇబి.దేవి గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఇబి.దేవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విల్సన్, ఉపాధ్యక్షులు నాగేంద్రప్రసాద్, ట్రెజరర్ చంద్రన్న, సలహాదారు దామోదర, సెక్రటరీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్ల అక్రమ వాడకంపై అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూడేరు మండలంలోని పలు హోటళ్లపై ఆకస్మికంగా తనిఖీలు చేసి రెండు డొమెస్టిక్ ఎల్‌పిజి సిలిండర్లను జప్తు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి.జయపాల్‌రెడ్డి, పి.శేషగిరి, రవీంద్రనాథ్, రెవెన్యూ అధికారులు ఎం.లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు వెళ్లొద్దు : డీఎస్పీ

ఆత్మకూరు : త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని పి.సిద్దరాంపురం గ్రామంలో డీఎస్పీ పర్యటించారు. ఇందులో భాగంగా అనుమానితుల ఇళ్లు, గడ్డివాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి గొడవలకు పాల్పడరాదన్నారు. ఎలాంటి గొడవలు జరిగినా కేసులు నమోదై మీతోపాటు మీ పిల్లలు ఇబ్బందులు పడతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దస్తగిరి, కానిస్టేబుళ్లు నల్లప్ప, వెంకటేశులు పాల్గొన్నారు.

జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ దినోత్సవం

అనంతపురం : 'నేషనల్ యూత్ ఫెస్టివల్ సందర్భంలో' భాగంగా గురువారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం, బిసిఎన్ కళాశాలలో జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డి.మురళీధర్‌రావు, ప్రిన్సిపల్ జి.సోమశేఖర్, బి.ఎల్.ఎన్.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యసోమప్ప, బోధనేతర, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వైవిఆర్‌కు సన్మానం

గుత్తి : మండల పరిధిలోని కొజ్జేపల్లి గ్రామ పేరును శ్రీపురంగా మారుస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడానికి సహకరించిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని గురువారం గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేతోపాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీపురం గ్రామానికి చెందిన గుత్తి మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్ మాట్లాడుతూ మండలంలో తమ గ్రామం పేరు చెప్పాలంటేనే ఎంతో అవమానంగా భావించేవారుమన్నారు. అయితే తమ గ్రామం పేరు మార్చాలని ఎన్నోఏళ్లుగా పోరాటాలు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గ్రామం పేరు మార్చేందుకు సహకరించారని, ఇందుకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహాలింగ, సి.రాముయాదవ్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'మెట్టు'కు హెచ్‌పిసిఎల్ బృందం కృతజ్ఞతలు

రాయదుర్గం : హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పిసిఎల్) చీఫ్ జనరల్ మేనేజర్ హరి ప్రసాద్, జనరల్ మేనేజర్ గోపాలకృష్ణ, నైరుతి జోన్ జనరల్ మేనేజర్ సందీప్‌రెడ్డి, డిజిఎం రాజేంద్ర కుమార్ గురువారం ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలోని హెచ్‌పిసిల్ ఆయిల్ టెర్మినల్‌కు సంబంధించి భూమి రిజిస్ట్రేష న్‌లో జరిగిన జాప్యానికి గల కారణాలను సమర్పించగా ఇటీవల మెట్టు అధ్యక్షతన జరిగిన ఎపిఐఐసి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అనుమతుల మంజూరులో చేసిన జాప్యాన్ని పరిగణనలోకి తీసుకొని వైసిపి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం పారిశ్రామికవేత్తల పట్ల స్నేహపూర్వక స్వభావానికి నిదర్శనం అని మెట్టు వెల్లడించారు.

మద్యం పట్టివేత

గార్లదిన్నె : మండల పరిధిలోని కోటంక గ్రామంలో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కోటంక గ్రామానికి చెందిన నాగిరెడ్డి, మల్లికార్జున మద్యాన్ని తీసుకొచ్చి గ్రామంలో అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.